

నేడు తిరుపతి ఐఐటీ 10వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

స్థానిక తిరుపతి ఐఐటీలో 10వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ శాశ్వత ప్రాంగణ నిర్మాణ సంస్థ ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఎండీ చక్రపాణి ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన వివరించారు. 2015 నుంచి తిరుపతి సమీపంలో తాత్కాలిక భవనంలో మద్రాసు ఐఐటీ సహకారంతో క్లాసులు ప్రారంభించుకున్నట్లు వివరించారు. పదేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశామని, అద్భుతమైన విజయాలు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఏర్పేడు సమీపంలోని 548 ఎకరాల సువిశాల స్థలంలో ఎంతో అధునాతన హంగులతో కూడిన శాశ్వత ప్రాంగణాన్ని నిర్మించుకున్నట్లు వివరించారు.

ఎన్టీఆర్ గృహకల్ప పేరుతో.. 'నకిలీ' పట్టాలు

గ్రామాల్లో రూ.20వేలు, పట్టణాల్లో రూ.50వేలు / దళారుల 'వసూళ్లపర్వం'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల స్థలాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇదే అదనుగా ఉమ్మడి జిల్లాలో కొందరు నకిలీ పట్టాలు పుట్టించి పేదలను దోచుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్, చంద్రగిరి, పుత్తూరు, తొట్టంబేడు, నాయుడుపేట, ఏర్పేడు ప్రాంతాల్లో 2014 నుంచి 2023 వరకు వివిధ ప్రాంతాల్లో పేదలకు ప్రభుత్వాలు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చాయి. గృహాలు మంజూరు చేశారు. సగం మంది గృహాలు నిర్మించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తోందని ప్రచారం చేస్తున్నారు. తమకు డబ్బు లిస్తే ఆయా కాలనీల్లో స్థలం ఇప్పిస్తామని దళారులు వసూళ్లపర్వం ప్రారంభించి నమ్మిస్తున్నారు.

పట్టాలకు 'ఎన్టీఆర్ గృహకల్ప'-'పేదలందరికీ ఇళ్లు, ఇంటి స్థలం బదలాయింపు దస్తావేజు' పేరు పెట్టారు. దానికి సంపూర్ణ, శాశ్వత హక్కులు అనగా దాన, వినిమయ, విక్రయ సర్వ హక్కులు కల్పించినట్లు చెబుతూ అందజేస్తున్నారు. ఎసైన్ ల్యాండ్లు పూర్తిగా ఉచితంగా బదలాయిస్తున్నట్లు చెబుతూ.. దస్తావేజుకు చెల్లించదగిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము, యూజర్ ఛార్జీలకు మినహాయింపు ఉందని ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వందలాది దొంగ పట్టాలు సిద్ధం చేసి గ్రామాల్లో 20 వేల రూపాయలు, పట్టణాల్లో 50 వేల రూపాయలు వసూలు చేశారు. కొంతమంది రెండు నుంచి మూడు పట్టాలు తీసుకోవడానికి పోటీపడి కూడా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.

శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పెద్ద సంఖ్యలో వీటిని ఇచ్చారు. ఇటు వడమాలపేట, పుత్తూరు, రామచంద్రాపురం, చంద్రగిరి, తిరుపతి రూరల్, పాకాల, భాకరాపేట, చిన్న గొట్టిగల్లు వంటి ప్రాంతాల్లో ఈ నకిలీ పట్టాలపై విస్తృత ప్రచారం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో కొందరు రెవెన్యూ సిబ్బంది సహకారంతోనే దళారులు దందా నడిపిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పేదలకు పట్టాలు ఇచ్చిన ప్రాంతాల్లో ఖాళీ స్థలాల వివరాలను సిబ్బంది మోసగాళ్లకు అందిస్తున్నారు. ఆ స్థలాలను చూపించి వాటిని బదలాయించినట్లు చెబుతూ దొంగ పట్టాలను తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

చూస్తేనే మోసం తెలిసిపోతుంది...

దొంగ పట్టాల్లోని సర్వే నంబరు చూస్తేనే ఇది నకిలీదని తెలిసిపోతుంది. ఇందులో ఇచ్చిన ఓ పట్టాకు సర్వే నంబరు 128-793గా చూపారు. సాధారణంగా సర్వే నంబరు ఇన్ని అంకెలతో రాదు. ఇళ్ల పట్టా మీద తహశీల్దారు సంతకం ఉంటుంది. మరోవైపు దస్తావేజులో ప్రస్తుత గ్రామ రెవెన్యూ అధికారి ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరించి రాయించి ఇచ్చినట్లు పేర్కొనడం గమనార్హం.

దొంగ పట్టాలు ఉంటే చర్యలు తప్పవు : తహశీల్దార్ భాగ్యలక్ష్మి..

తిరుపతి అర్బన్ మండలం పరిధిలో ఎక్కడైనా దొంగ పట్టాలు సృష్టించి అమ్ముతుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వాటిని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు మోసపోయి బోగస్ పట్టాలు కొనుగోలు చేయవద్దని హితవు పలికారు.

నేడు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి రాక

తిరుపతి టౌన్ : ఈనెల ఏప్రిల్ 4వ తేదీన శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జిల్లాలో పర్యటించనున్నారనీ కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తేదీ నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకున్న అనంతరం సాయంత్రం ఆరు గంటలకు గూడూరు లోని ఆది శంకర ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల నందు జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకలలో , మహర్షి మహేష్ యోగి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 8.15 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకొని హైదరాబాద్‌కు వెళ్ళనున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



పుత్తూరు, వడమాలపేట మండలాల సమీక్షా సమావేశానికి విచ్చేసిన కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

శ్మశానానికి దారి చూపండి

రెండేళ్లుగా పట్టించు కోలేదు

కలెక్టర్‌కు సిపిఎం, సిపిఐ వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ఒకటో వార్డులోని కట్టకింద రామకృష్ణాపురం శ్మశానానికి దారి చూపాలని రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని సిపిఎం పుత్తూరు ప్రాంత కార్యదర్శి ఆర్.వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య అన్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు మున్సిపాలిటీలో పుత్తూరు, వడమాలపేట మండలాల సమీక్షా సమావేశం జరిగింది. 35 మంది రైతులు పట్టా భూమి ఇచ్చి దారి చూపించారని, ఒక రైతు గోవిందరెడ్డి రెండు సెంట్లు ఇవ్వడానికి నిరాకరించడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేయాలని, సమ్మర్ స్టోరేజి పూర్తి చేసి తాగునీరు అందించాలన్నారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా చేసి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. పుత్తూరుకు సబ్‌జైలు, ఆర్డీవో ఆఫీసు, ట్రెజరీ, లేబర్ ఆఫీసు, ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. తాయ్‌మాంబాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. బిసి బాలుర, గర్ల్స్ హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. మండలంలోని శ్మశానాలు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జ్యోతిబసునగర్, సుందరయ్యనగర్‌లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు, నియోజకవర్గ ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఐ నాయకులు మహేష్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తిచేసి లబ్దిదారులకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురగేష్‌రెడ్డి, మహేష్, చిరంజీవి, హేమాద్రి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు : కలెక్టర్

వేసవి దృష్ట్యా ఎక్కడా నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. పుత్తూరు, వడమాలపేట మండలాల అభివృద్ధికి సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. గురువారం పుత్తూరు పురపాలక సమావేశ మందిరంలో ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ సమక్షంలో సమీక్ష జరిగింది. వడమాలపేట, పుత్తూరు మున్సిపాలిటీ, మండలాల్లో తాగునీటి సమస్య ఉందన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. పల్లె పండుగ, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఉద్యాన శాఖ ద్వారా మామిడి పంట కాకుండా కొత్తగా ఇతర పంటలు వేసేందుకు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నగరి ఎంఎల్ఎ మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉండి భూమిలేని వారిని గుర్తించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ ఎం మంజునాథ్ గౌడ్, ఎంపిడిఓలు రమేష్ బాబు, శేషగిరిరావు, జిల్లా పంచాయతీ అధికారి సుశీలదేవి, ఇరిగేషన్ ఈ ఈ వేంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లతో అదనపు భారం : రైతుసంఘం

ప్రజాశక్తి -ఏర్పేడు

మోటార్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టడం ద్వారా రైతులకు అదనపు భారం పడుతుందని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య అన్నారు. ఏర్పేడు మండలం బండివానిపల్లిలో రైతులతో కలిసి గ్రామ కమిటీ ఏర్పాటయ్యింది. రైతులకు ధాన్యం గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లు పెడితే నాలుగువేల నుంచి ఐదువేల రూపాయలు అదనంగా రైతులపై భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారెడ్డి పాల్గొన్నారు.

'అమర' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సత్కారం

ప్రజాశక్తి - రేణిగుంట

అమర ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తూ ప్రివిలైజ్ కార్డును అందజేయడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంతో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మిని సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తిరుపతి నగర శాఖ ఆధ్వర్యంలో మెమెంటోను అందజేసినట్లు జిల్లా అధ్యక్షులు కెఆర్ శంకర్, కోశాధికారి తాళ్లపాక సిద్ధయ్య, నగర శాఖ ప్రధాన కార్యదర్శి చెరుకునూరు వెంకటేశం శెట్టి పేర్కొన్నారు. అమర ఆస్పత్రి విఆర్ఓ హేమకుమార్, మార్కెటింగ్ మేనేజర్ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



7న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల మహాధర్నా



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఈనెల ఏడో తేదీ ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద జరగనున్న ఆందోళనకు కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర పిలుపునిచ్చారు. గత 11 రోజులుగా ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం జరగనున్న మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సాయిలక్ష్మి, లక్ష్మి, సుజాత, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు. దీక్షల్లో శ్రీకాళహస్తి కార్యదర్శి రవి, నాయకులు మురళి, హరి, హుస్సేన్‌పీర్, ఆత్మకూరు కార్యదర్శి విజయరామిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అలీ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. కాన్సుల్ జనరల్, ఆయనతో పాటు విచ్చేసిన అధికారుల బందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఇండో-రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తుచేసిన ఆయన, ఈ సందర్శన ఫలితంగా మరిన్ని రష్యన్ పరిశ్రమలు భారత మార్కెట్‌కు తమ ప్రధాన స్థావరంగా శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమను సందర్శించారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.



భాష్యం ప్రాపోస్ట్, బ్లూమ్స్ స్కూల్ ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలో నూతనంగా నిర్మించిన భాష్యం ప్రా పోస్ట్, భాష్యం బ్లూమ్స్ సీబీఎస్ఈ స్కూల్‌ను జోనల్ ఇన్చార్జ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. అవిలాల గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులలో బాల్యం నుండే సజనాత్మకతను వెలికి తీయడానికి భాష్యం విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుటాయని, దానిలో భాగంగానే సి.బి.యస్.ఈ స్కూల్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంచి విద్య వలన సమసమాజ స్థాపన ఏర్పడుతుందని, అత్యాధునిక తరగతి గదులతో, మంచిసౌకర్యాలతో అంకిత భావంతో కూడిన విద్యా వేత్తలతో స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నగర మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.



అలరించిన 'సంస్కృత' నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ చే విద్యార్థులకు శాస్త్రీయ సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు సంస్కృత పేరుతో శాస్త్రీయ నత్య ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ స్కూల్ డైరెక్టర్స్ డాక్టర్ కష్ణ కిషోర్, వసంత కిషోర్ మాట్లాడుతూ భారతీయ కళల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, తమ స్కూలు ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సంస్కృత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పురుషోత్తం, రవి, వంశీకష్ణ పాల్గొన్నారు.

ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో ఎస్పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీ, క్రైం పోలీసు స్టేషన్లలో ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన పిటిషన్‌లపై ఎలా స్పందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిటిషన్ల విచారణలో జాప్యం చేయరాదన్నారు. అన్ని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవి మనోహర్ ఆచారి, డిఎస్‌పి శ్రీలత పాల్గొన్నారు. అలిపిరి టోల్‌గేట్‌లోనూ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విఐపి వాహనాలు, సామాన్యులు వెళ్లే కార్లుతో పాటు, ద్విచక్రవాహనాలు వెళ్లే మార్గాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్కానింగ్ విధానాన్ని పరిశీలించారు.

టిడిఆర్ బాండ్ల జారీకి నేడు స్పెషల్ డ్రైవ్ : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టీడీఆర్ బాండ్ల జారీ కోసం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంలో భాగంగా స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లను త్వరితగతిన జారీ చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ డ్రైవ్ నందు టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని, టీడీఆర్ బాండ్ల కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేయించడం, ఇతర సమస్యలు పరిష్కరించడం వంటివి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా వాలిడేషన్ చేయించుకునే వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని తెలిపారు, ఆన్లైన్ ఎండార్స్మెంట్ ఇచ్చిన వారు, షార్ట్ ఫాల్ ఇచ్చిన వారు రావాలని తెలిపారు. టీడీఆర్ బాండ్లు పొందాల్సిన వారు స్పెషల్ డ్రైవ్ కు తగిన డాక్యుమెంట్లతో హాజరుకావాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నిరసన

ప్రజాశక్తి- రేణిగుంట

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సవరణ బిల్లును మూజువాణి ఓటుతో పార్లమెంట్‌లో ఆమోదించడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా గురువారం పెన్షనర్లు నిరసన తెలిపారు.రేణిగుంటలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద సమావేశమై తమ డిమాండ్ల సాధనకు ఉద్యమించాలన్నారు. పెన్షనర్ల విధి విధానాలను మార్చిన బిల్లును రద్దు చేయాలని, కొత్తవారికి పాతవారికి ఒకే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. వివక్షతతో కూడిన పెన్షన్ సవరణను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఎస్ హసన్ సాహెబ్ , రేణిగుంట పట్టణ సర్పంచ్ ఆర్ నగేష్ , బ్రాంచ్ కార్యదర్శి కుమార్, ఆఫీస్ బేరర్లు జి రాజేంద్ర ప్రసాద్ , అప్పారెడ్డి , బి రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



రియల్ ఎస్టేట్ ఆలయాలతో అనుసంధానం వద్దు : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తమ వ్యాపార అవసరాల కొరకు రియల్ ఎస్టేట్ వెంచర్ల వద్ద ఆలయాలు నిర్మిస్తున్న వాటి బాధ్యతను టీటీడీ తీసుకోవాలని భావించడం అన్యాయమని, ఈ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం అమరావతిలో జరిగిన టిటిడి సమీక్ష సమావేశంలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న జి స్క్వేర్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ తాను వెంచర్లు చేపట్టిన చోట టీటీడీ ఆలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తున్నందున దాని నిర్వహణ బాధ్యతను టీటీడీ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించడం అసమంజసమైందని, ఈ రకమైన ధోరణితో పోతే దేశంలో అనేక వివాదాలకు కేంద్రంగా టిటిడి మారుతుందని, వ్యాపార అవసరాల కోసం వ్యక్తులు చేసే ఆలయాల నిర్మాణానికి టీటీడీ బాధ్యత వహించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కళ్యాణ మండపాలు నిర్మించి వాటి నిర్వహణ చేయలేక టీటీడీ చేతులెత్తేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో కోడెల శివప్రసాద్ తన నియోజకవర్గంలో నిర్మించుకున్న కళ్యాణ మండపాన్ని టీటీడీ నిర్వహించలేక కేవలం నెలకు రూపాయి లీజుతో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కళ్యాణ మండపాల నిర్వహణే చేతగాని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, దేశంలో పలుచోట్ల ఆలయాలు నిర్మిస్తున్నారని వాటి నిర్వహణ కూడా ఇబ్బందికరమైందని, ఇవే కాకుండా ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ సంస్థలు చేపట్టే ఆలయాలను టీటీడీ బాధ్యత తీసుకోవాలనుకోవడం సమంజసం కాదని, తక్షణం ఈ అంశంపై పునరాలోచన జరపాలని పేర్కొన్నారు.

మైనింగ్ మాఫియాకు పోలీసులు కాపలా : కిలివేటి

ప్రజాశక్తి - నాయుడుపేట

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తూ, వైసిపి నాయకులను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, మైనింగ్ మాఫియాకు స్వయంగా పోలీసులే కాపలాదారులుగా ఉన్నారని సూళ్లూరుపేట మాజీ ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నాయుడుపేటలో తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొమ్మిది నెలల పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి మాజీ సిఎంను టార్గెట్ చేస్తూ అనేక రకాలుగా అవమానిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పోలీసులను, మైనింగ్ అధికారులను ఇసుక, మట్టి, గ్రావెల్, మైనింగ్ మాఫియాకు కాపలాదారులను చేశారని విమర్శించారు. లిక్కర్ సిండికేట్ ద్వారా లక్షలు దోచుకుంటున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో పింఛన్ పంపిణీ తప్ప మరే హామీ అమలు కాలేదన్నారు. 2027లో జమిలి ఎన్నికలు జరిగితే ప్రజలు చంద్రబాబుకు గుణపాఠం చెబుతారన్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసే వరకూ పోరాటం సాగిస్తామన్నారు.



విలేకరుల సమావేశంలో కిలివేటి సంజీవయ్య

త్వరలో బెల్టుషాపులపై పోరాటం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జలదంకి వెంకటకష్ణారెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

చిక్కదు..దొరకదు..!

సిసి కెమెరాల్లో కదలికలు

బోనులో పడని చిరుత

ఎస్వీయూలో అలర్ట్



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాలలో ఏడాదిగా పలు జంతువులపై చిరుత స్వైర విహారం చేస్తోంది. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, స్విమ్స్, ఎస్వీయూ, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల, జూపార్క్ రోడ్డు, అలిపిరి తదితర ప్రాంతాలలో చిరుత పులి సంచరిస్తూ ఉంది. అలిపిరి రోడ్డు మార్గంలో మూడు నెలల క్రితం పట్టపగలే రోడ్డు దాటుతుండగా ఒక బైక్ చిరుత పులిని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన తెలిసిందే. ఇటీవల కాలంలో ఎస్వీయూలో చిరుత పులి దాడిలో వర్సిటీలోని అనేక ప్రాంతాలలో సాధు జంతువు అయిన కుక్కలు కనుమరుగైన సంఘటనలు కోకొల్లలు. దీన్ని దష్టిలో ఉంచుకొని ఎస్వీయూ ఉన్నతాధికారులు, అటవీ శాఖ ఉన్నతాధికారుల సహాయంతో పలుచోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. వర్సిటీలో ఉదయం 7 గంటల లోపు సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరు సంచరిద్దరించవద్దని హెచ్చరిక బోర్డులను కూడా ప్రదర్శించారు. అయితే చిరుత పులి చాలా తెలివిగా వ్యవహరిస్తూ బోన్లు పెట్టిన ప్రాంతాన్ని అతి జాగ్రత్తగా గమనిస్తూ బోన్ లో పడకుండా తెలివిగా వ్యవహరించి తప్పించుకు తిరుగుతూ ఉందని అటవీశాఖ అధికారులు చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు ఐ బ్లాక్ పరిసర ప్రాంతాల చుట్టూ, ప్రధాన గ్రంథాలయం వెనుక భాగంలో, విభాగం చుట్టుపక్కల, హెచ్ బ్లాక్ పరిసర ప్రాంతాలలో పరిసర ప్రాంతాలలో ముళ్లకంపలను పూర్తిగా పరిశుభ్రం చేయించారు. అయినా చిరుత పులి తన దాడులను జింకలపై కొనసాగిస్తూనే ఉంది. రెండు రోజుల క్రితం ప్రధాన లైబ్రరీ వెనుక భాగంలో ఒక జింక పిల్ల పై దాడి చేసిన చిరుత పులి, నేడు ఇంజనీరింగ్ కళాశాల సభ సమీపంలో ఒక తల్లి జింక పై దాడి చేసింది. చిరుత పులి సీసీ కెమెరాల్లో కనిపిస్తుంది కానీ, బోనులకు మాత్రం చిక్కడం లేదు. అటవీ శాఖ అధికారులు ఆ చిరుత పులి తన పిల్లల కని, ఆవాసంగా మార్చుకుని ఇక్కడే పిల్లలకు ఆహారం అందించేందుకు అనుకూలంగా ఉన్న ఎస్వీయూ, వేదిక్, పశు వైద్య వర్సిటీ, వ్యవసాయ కళాశాల పరిసర ప్రాంతాల్లోని కుక్కలను, ఇతర చిన్న చిన్న జంతువులను, జింకలను, పందులను వేటాడుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తుందని వారు వెల్లడించారు. నేడు ఎస్వీయూలో జింకపై చేసిన చిరుత పులి దాడితో వర్సిటీలో విద్యార్థులు సిబ్బంది ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వెంటనే రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో సంప్రదించి ఎస్వీయు అధికారులు చిరుత పులిని బంధించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కచ్చితంగా వర్సిటీలలో పనిచేసే సిబ్బందిని, విద్యార్థులను కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.


ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి

ఎన్ఎంయు డిమాండ్



ప్రజాశక్తి - సత్యవేడు: ఆర్టీసీ శాఖలోని అన్ని కేటగిరీలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సత్యవేడు డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ఎన్ఎంయు యూనిటీ అసోసియేషన్ పిలుపుమేరకు రెండు రోజులపాటు నిరసన తెలియజేశారు. గురువారం ఉదయం స్థానిక డిపో ప్రవేశ ద్వారం వద్ద ఎన్ఎంయు యూనిటీ అసోసియేషన్ సభ్యులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు డిపో ఏఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ సెక్రెటరీ వి.బాబు మాట్లాడుతూ ఉద్యోగులందరికీ డిజిటల్ గుర్తింపు కార్డులను ఇవ్వాలని, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచలయ్య, డిపో అధ్యక్ష పి.పి.సారధి, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ శేఖర్, కుప్పయ్య, సిసిఎస్ డెలిగేట్ జి సురేష్, కేసీఆర్ నాయకులు, డిపో నాయకులు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జారాయుళ్ల నుంచి మా స్థలాన్ని కాపాడండి



ఎన్ఆర్ఐ రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, తిరుచానూరులో కబ్జా రాయుళ్ళు రెచ్చిపోతున్నారని, ఎన్.ఆర్.ఐలకు చెందిన స్థలాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని, వారి బారి నుంచి తమ స్థలాలను కాపాడాలని ఓ ఎన్నారై పోలీసులను వేడుకున్నారు. సిడ్నీలో ఉంటున్నా ఎన్నారై రాజేంద్రప్రసాద్ గురువారం మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరులో కోట్లు విలువైన భూములని కబ్జారాయాళ్ళు ఆక్రమించుకుంటున్నారని, పైగా సెటిల్ మెంట్ చేసుకొని పక్షంలో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తిరుచానూరులో కోట్లు విలువ చేసే తన భూమిని కబ్జా చేశారని, పోలీసులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. తన తండ్రి రిటైర్డ్ ఎక్సయిజ్ సూపరింటెండ్‌గా పనిచేసిన వ్యక్తి, 4సార్లు ఎస్పీను కలిసినా తిరుచానూరు సి.ఐ స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఏపిఎన్.ఆర్.టి ద్వారా కంప్లయింట్ చేస్తే నామ మాత్రంగా కేసు నమోదు చేసారని వాపోయారు. పోలీసులు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమావేశం




ప్రజాశక్తి - కేవిబి పురం: కేవీబి పురం కేంద్రంలో గురువారం ఆశ వర్కర్లు సమావేశాన్ని నివసించినట్లు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నాగలాపురం నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కొత్త యాప్‌లు పెట్టి పని భారాన్ని ఎక్కువ చేస్తున్నారని, దీనికి తోడు గర్భవతులను ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకొని పోవడానికి రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న వారికి బస్సు చార్జీలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం ఆశా వర్కర్ల సేవలను గుర్తించి వారు రానుపోను చార్జీలు ప్రభుత్వం ఇవ్వాలని ఆశా వర్కర్లకు రికార్డు వర్క్‌ను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్స్ వినియన్ కార్యదర్శి రాజేశ్వరి, ఆశ వర్కర్లు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి లక్ష్మి, కె.వి పురం మండలం అధ్యక్షురాలు సరళ, కోవునూరు కార్యదర్శి సుజాత, మునెమ్మ, పద్మ, దీప, శారద, ఎల్లమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఏహెచ్ లో 'కాయకల్ప్' బృందం పర్యటన



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాయకల్ప్ బృందం గురువారం స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి ఆవరణతో పాటు అన్ని వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్యం, మౌలిక వసతులపై ఆరా తీశారు. పారిశుధ్యం, బయో వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్లు సోకకుండా ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. కాయకల్ప్ పథకంలో భాగంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి గతంలో ఏ గ్రేడ్ సాధించింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంవో మధు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీనటి పూజా హెగ్డే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సినీనటి పూజా హెగ్డే గురువారం కుటుంబ సమేతంగా స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. తదనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఎంజీఎం ఆతిథ్యం.. ముక్కంటి దర్శనార్థం శ్రీకాళహస్తికి విచ్చేసిన నటి పూజా హెగ్డేకు స్థానిక ఎంజీఎం గ్రాండ్ హోటల్ ఆతిథ్యం ఇచ్చింది. ఎంజిఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ఐశ్వర్య దంపతులు పూజా హెగ్డేకు స్వాగతంపలికి బస ఏర్పాట్లు చేశారు.

నాగబాబుతో వినుత దంపతులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబును గురువారం ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి కోట వినుత, చంద్రబాబు దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై జనసేన తరపున పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం విజయవాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి తిరుపతి-పళనికి బస్సు సౌకర్యం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం, తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో ఉన్న రాస్ వృద్ధాశ్రమంలో పెనుమల్లం ప్రాంతానికి చెందిన మునిరాజా 25 మంది వృద్ధులకు దుస్తులను, పండ్లు పంపిణీ చేశారు. మునిరాజా తల్లి అక్కుర్తి ధనమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమాన్ని చేయడం జరిగిందన్నారు.

పోలీసులకు దొంగల సవాల్..!



- మంగళంలో వరుస దొంగతనాలు
- సవాలు విసురుతున్న దొంగలు
- పహారాపై స్థానికుల ఆగ్రహం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాంతంలో గత కొన్ని నెలలుగా దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ అందిన కాడికి దోచుకుని పోలీసులకు సవాలు విసురుతున్నారు. వరుస దొంగతనాలతో మంగళం ప్రాంతంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళం ప్రాంతం మైగ్రేటెడ్ ఏరియా కావడంతో ఇక్కడికి ఎవరు వస్తున్నారు... ఎవరు పోతున్నారు అన్న విషయాలు అంత చిక్కడం లేదు. మరోవైపు గంజాయి మూకల అలజడి ఎక్కువ కావడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. కట్టడి చేయాల్సిన పోలీసు యంత్రాంగం కేసుల నమోదుకు పరిమితమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అటవీ సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ ప్రాంతం నుండి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ అధికారులు పలుమార్లు ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. కొన్ని రోజులుగా రాత్రిపూట గస్తీ వచ్చే పోలీసులు తమ వాహనాలకు ఉన్న పోలీస్ సైరన్ మోగిస్తూ వెళుతుండడంతో స్థానికులు దీనిపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఎక్కడైనా గుట్టు చప్పుడు కాకుండా దొంగలను పట్టుకునే ప్రక్రియను అనుసరించే పోలీసులు రాత్రిపూట పెద్ద శబ్దంతో సైరన్లు వేసుకుంటూ కాలనీలో వెంబడి వెళ్లడంతో దొంగలు జాగ్రత్త పడరా అని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ సిబ్బంది నివాసం ఉండే హ్యాబిటేషన్స్‌లో సైతం రాత్రిపూట సైరన్లు మోగించడం చర్చనీయాంశమైంది.

ఎల్‌హెచ్ఎంఎస్ పై అవగాహన లేకపోవడం

పోలీసు విభాగంలో ప్రజల ఆస్తుల పరిరక్షణకు కోసం తయారుచేసిన (లాకుడ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం) ఎల్‌హెచ్ఎంఎస్ పై ఇలా వరుస దొంగతనాలు జరిగే చోట గతంలో స్థానిక ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఇప్పుడు నిర్వహించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

తుడా క్వార్టర్స్ లోనే..

09-02-2025 తేదీ..

తిరుమల నగర్, గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్‌లోని ఎంఐజి 81లో నివాసం ఉండే సిమ్స్ సూపరింటెండెంట్ ఏఆర్ నరేంద్రబాబు ఇంట్లో 188 గ్రాముల బంగారం, రూ.48 వేల రూపాయల నగదు దొంగలు ఈ ఏడాది



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఫిబ్రవరి 9వ తేదీన దోచుకెళ్ళారు. నరేంద్రబాబు భార్య వెన్నుముక ఆరోగ్య సమస్యతో ఫిబ్రవరి 5వ తేదీ సిమ్స్ హాస్పిటల్‌కు సర్జరీ నిమిత్తం అడ్మిట్ అయ్యారు. సర్జరీ ముగించుకుని 8వ తేదీ వరకు సిమ్స్ హాస్పిటల్‌లోనే ఉన్నారు. చిత్తూరు నుండి నరేంద్రబాబు కుమారుడు రేవంత్ తన తల్లిని హాస్పిటల్లో పరామర్శించి తుడా క్వార్టర్స్ లోని ఇంటికి వచ్చి చూడగా దొంగతనం జరిగిందని గమనించి తండ్రికి సమాచారం అందించాడు. దీనిపై ఎస్సై జగన్నాథం బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

25-03-2025 తేదీ..

ఎల్ఐజి 296లో నివాసముండే అమరరాజా ఉద్యోగి అనిల్ కుమార్ ఇంట్లో కిటికీ ఇనుప కమ్మీలను తొలగించి దొంగలు బంగారం, వెండి, నగదును దోచుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. సొంత పనిపై హైదరాబాద్ నగరానికి వెళ్లి రెండు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తే ఇంటి కిటికీ ఇనుప కమ్మీలు తొలగించి ఉండడాన్ని చూసి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బంగారం మళ్లీ సంపాదించుకుంటానని, కానీ నా బిడ్డలకు మా పెద్దలు ఇచ్చిన ఆభరణాలను జ్ఞాపకాలుగా ఉంచుకున్నానని, దానిని పోగొట్టుకోవడం చాలా బాధ వేస్తుందని మీడియాతో అనిల్ కుమార్ ఆనాడు అన్నారు.

01-04-2025 తేదీ..

ఎంఐజి 510లో నివాసముడే పి.వెంకటరాజు తన బంధువుల ఇంటికి గుంటూరుకు వెళ్లి వచ్చేసరికి 98 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, లక్ష రూపాయల నగదు దొంగలు దోచుకెళ్ళినట్లుగా తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నానని మీడియాకు తెలిపారు.

క్రైం న్యూస్

లాడ్జీలో 'వ్యభిచారం' గుట్టు రట్టు

పోలీసుల అదుపులో ఇద్దరు విటులు, నలుగురు మహిళలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీకాళహస్తి వ్యభిచార కూపంగా మారుతోందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న పట్టణ నాలుగు మాడా వీధులను కేంద్రంగా చేసుకుని కొందరు లాడ్జీల నిర్వాహకులు మహిళల చేత వ్యభిచారం చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కోణంలోనే పట్టణంలోని తేరువీధిలోని అష్టలక్ష్మి లాడ్జీపై గురువారం వన్ టౌన్ పోలీసులు దాడి చేసి, వ్యభిచారం చేస్తున్న ఇద్దరు విటులు, నలుగు రు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. లాడ్జి నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

మతి స్థిమితం లేని మహిళ అదృశ్యం



ప్రజాశక్తి -ఏర్పేడు : కందాడు గ్రామానికి చెందిన ఆనంద సుబ్రహ్మణ్యం భార్య ఆనంద సెల్వి (47) రెండు సంవత్సరాలుగా మానసిక వ్యాధికి చికిత్స పొందుతోంది. సోమవారం ఆనంద సుబ్రహ్మణ్యంకు కంటి ఆపరేషన్ నిమిత్తం తన కుమారుడు మునిశేఖర్‌తో కలిసి తిరుపతి వెళ్లడం జరిగింది. తండ్రి, కొడుకు ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చేసరికి ఆనంద సెల్వి కనబడలేదు. చుట్టుపక్కల విచారించినప్పటికీ ఆచూకీ తెలియనందున ఏర్పేడు పోలీసు స్టేషన్‌లో మునిశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జయశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన తహశీల్దారుగా శ్రీదేవి


ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ తాసిల్దారుగా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు.

రాబోయే రోజులు మనవే : నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి




ప్రజాశక్తి -వెంకటగిరి: వైసిపి వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో గురువారం స్థానిక నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవన్‌లో వెంకటగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నేతలు మల్లి రామ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9 వ తేదీన జరగనున్న మున్సిపల్ చైర్పర్సన్ నక్క భానుప్రియపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్లు పార్టీ నిబంధనలను పాటించి విశ్వసనీయత చాటాలని సూచించారు. ఇటీవల వెంకటగిరి మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ నేతల అధికార దుర్వినియోగంతో ఎంపీటీసీ శ్రీదేవిని సమావేశానికి హాజరు కానివ్వకుండా భయపెట్టినా, ఆమె ప్రతిఘటించిన తీరు వైఎస్ఆర్సిపి కార్యకర్తల ధైర్యాన్ని చాటిందన్నారు. ఈ అంశంపై జిల్లా పరిషత్ సీఈవో, తిరుపతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తప్పు చేసిన అధికారులను వదలబోమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు పంటలకు గిట్టుబాటు ధర, అన్నదాత సుఖీభవ అందించకుండా రైతులను మోసం చేశారని దుయ్యబట్టారు. జెమిలి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం తథ్యమని, వైసీపీ 2.0 లో పార్టీ కార్యకర్తలకే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తారన్నారు. ఈ క్రమంలో రాబోయే రోజులు మనవే అని నేదురుమల్లి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను పేరుపేరునా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

గూడూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం గూడూరు కోర్ట్ ప్రాంగణంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడుగా సోమిశెట్టి ఉమాశంకర్, ఉపాధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెంకట కృష్ణయ్య, కోశాధికారిగా వహీద, లైబ్రరీ సెక్రటరీగా యూసఫ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్ కుమార్, మహిళా ప్రతినిధిగా నాగూర్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నవకోటి, సుమన్, ఏడుకొండలు, సుమన్, మహబూబ్ భాషలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సాయి కుమార్ రెడ్డి, కొత్తపల్లి వసంత్ కుమార్, చంద్ర మోహనరెడ్డి, విజయరామ రాజు, కెవి కృష్ణయ్య, శ్రీధర్, గోపాల్ రెడ్డి, కోటేశ్వరావు, ఎస్వి, వనం ప్రసాద్, తీగల చంద్రశేఖర్, పచ్చికల అనీల్, ఈదురు మధుకర్, యనమల గురు సాయి, పులవర్తి నరేంద్ర, సర్వేపల్లి దయాకర్, సన్నిబోయిన శ్రీనివాసులు యాదవ్ విజయ్ భాస్కర్ రెడ్డి, సునీల్, మోహన్, పులికొండ శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

తిరుపతి-పళని మధ్య బస్సు సర్వీస్ ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆధ్యాత్మిక క్షేత్రాల మధ్య ఆంధ్రప్రదేశ్ నుంచి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ప్రారంభించారు. పూజలు నిర్వహించి, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో కలిసి నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. అమరావతిలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంఎల్సీ హరి ప్రసాద్, ఎమ్మెల్యే అరని శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భారతి తీర్థస్వామి వజ్రోత్సవ మహాసభ



తిరుమల : శ్రీ భారతి తీర్థ స్వామి వారి 75వ జన్మదిన సందర్భంగా వజ్రోత్సవ మహాసభలను తిరుపతి శృంగేరి శంకరమఠంలో నిర్వహించారు. శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర శారదాంబ గుడిలో విశేష పూజా కార్యక్రమాలు, రాముల వారి గుడి ఉత్తరమాడవీధి, శంకర మఠంలో శ్రీ ఆది శంకరాచార్యుల వారికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మఠం ముఖ్య కార్యదర్శిగా గండ్రకోట లక్ష్మి మనోహర్ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమం మొత్తం ధర్మాధికారి రాళ్లపల్లి రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. శంకరమఠం మేనేజర్ నడింపల్లి కృష్ణ, పూర్ణచంద్ర, సురభి మురళి పాల్గొన్నారు.

గర్భ కండ్రిగ భూముల రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి -కోట : గర్భ కండ్రిక భూముల రైతులను ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. గురువారం కోట మండలం వెంకన్నపాలెం గ్రామ పంచాయతీలోని గర్భ కండ్రిగ భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి రైతులు వద్ద ఉన్న పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వెంకన్నపాలెంలోని వివిధ సర్వే నంబర్లలో 342.77 సెంట్లు భూమి ఇనాం అబాలిషన్ చట్టం ప్రకారం రద్దుపరచి ఉన్నారని తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన జేసీ పదిరోజులు తర్వాత మరలా పరిశీలించి న్యాయం చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కటారి జయ జయ రావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, కోట ఎస్సై పవన్ కుమార్, ఆర్ఐ మధులత, వీఆర్వో కృష్ణ, రెవిన్యూ సిబ్బంది, వెంకన్నపాలెం గ్రామ సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగివుండాలి

ప్రజాశక్తి -కోట : పొదుపు మహిళా సభ్యులు అందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగివుండాలని వెలుగు ఏపీఎం అనీలా అన్నారు. ఈ సందర్భంగా గురువారం కోట మండలంలోని వెలుగు కార్యాలయంలో వి ఓ ఏ లకు ఎస్ హెచ్ జి క్రెడిట్, లైవ్లీ హుడ్ విధానాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే జరిమానా : కమిషనర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : నగరంలోని ఖాళీ స్థలాల్లో చెత్తవేసినా, శుభ్రంగా ఉంచకపోయినా జరిమానాలు విధించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం 14, 17 వార్డుల్లో పారిశుధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరు ఇస్తే కలిగే లాభాలను పద్మావతి పార్కులో ప్రజలకు వివరించారు. ప్రతి వీధిలోకి చెత్త వాహనం ఒక నిర్దిష్ట సమయంలో వెళ్లేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ ఉన్నారు.

తాతయ్యగుంట గంగజాతరకు ఏర్పాట్లు .. తిరుపతి తాతయ్యగుంట గంగజాతరలో భక్తులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కల్పించాల్సిన వసతులను చక్కగా చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లపై శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గంగజాతరకు వచ్చే భక్తులకు తాగునీరు అందించాలని, ఆలయ ప్రదేశాల్లో పడ్డ చెత్త ఎప్పటికప్పుడు తొలగించి, బ్లీచింగ్ చల్లి పరిశుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని ఫైర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన... సంయుక్త సర్వే నిర్వహించిన అధికారులు

స్పందనకు వందనం



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): కాలువ స్థలం ఆక్రమించి... రోడ్డు మార్గం ఏర్పాటు అన్న శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఇరిగేషన్ అధికారిని కవిత రెడ్డి, తిరుపతి అర్బన్ మండల సర్వేయర్ జగదీష్ సర్వే నెంబర్ 162లో మురుగు కాలువ విస్తీర్ణాన్ని లెక్కించడానికి సర్వే నిర్వహించారు. ప్రస్తుతం కాలువ విస్తీర్ణం ఎక్కువగా ఉందని సర్వేలో అధికారులు గుర్తించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు, నగరపాలక అధికారులు అక్రమణదారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రానైట్ క్వారీపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



క్వారీల వద్ద వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా రెవెన్యూ శాఖ అధికారులు, తాసిల్దారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈసలాపురంలోని గ్రానైట్ క్వారీలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. సిపిఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఈసలాపురం, ఎస్టీ కాలనీకి చెంది న రమేష్ కుమారుడు దినేష్‌కు(3) క్వారీలో బాంబు పేలుళ్లలు చేయడంతో రాయి తలపై పడి తీవ్ర గాయాలయ్యాయన్నారు. విషయం ఈరోజు కలెక్టర్ పుత్తూరుకు రావడంతో ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి క్వారీ నియమాలు పాటించాలని యజమానులకు తెలిపారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

మిల్కీ మిస్ట్‌తో మిల్క్ లైన్ భాగస్వామ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇన్నోటెర్రా పాడి, పశువుల మేత వ్యాపార సంస్థ అయిన మిల్క్‌లేన్, మిల్కీ మిస్ట్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు మిల్క్‌లేన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ శర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మిల్కీ మిస్ట్ తన అధునాతన ప్రాసెసింగ్ టెక్నాలజీని, మార్కెట్ పరిధిని ఉపయోగించి అత్యుత్తమ పాల ఉత్పత్తులను అందిస్తుందని తెలిపారు. పాల సేకరణ కేంద్రాలలో కఠినమైన యాంటీబయాటిక్స్, కల్తీ పదార్థాల పరీక్షలతో సహా కఠినమైన నాణ్యత నియంత్రణ ప్రోటోకాల్‌లను ఉపయోగిస్తుందని వెల్లడించారు.

అగ్దెర్‌తో ఐఐటీ ఎంఓయూ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన నార్వే దేశపు అగ్దెర్ యూనివర్శిటీతో కలసి 'కొటుటెల్లె' (జాయింట్ సూపర్విషన్) పీహెచ్‌డీ ప్రోగ్రాం నిర్వహణకు సంబంధించి ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో గురువారం ఇరు సంస్థలు భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. కొటుటెల్లె పీహెచ్ఎ ప్రోంగ్రాం అభివృద్ధికి రెండు విద్యాసంస్థలు కలసి పని చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కెఎన్ సత్యనారాయణ, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రామకృష్ణ గోర్తి, ప్రొఫెసర్ శశిధర్ గుమ్మతో కలసి ఆయన నార్వే అగ్జర్ యూనివర్శిటీ ప్రతినిధులు ప్రొఫెసర్ లింగారెడ్డి శంకరమద్ది తదితరులతో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

రైతు అనుమానాస్పద మృతి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని తొండమనాడు గ్రామంలో ఓ రైతు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి బంధువుల కథనం మేరకు.. స్థానిక గ్రామానికి చెందిన రైతు చిన్న బత్తిరెడ్డి(60) కుటుంబానికి పక్కనే నివాసం ఉంటున్న మరో కుటుంబంతో స్థల వివాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2 రోజుల కిందట బత్తిరెడ్డి అదృశమయ్యాడు. గురువారం తెల్లవారుజామున తొండమనాడు మడుగు వద్ద బత్తిరెడ్డి ఓ చెట్టుకు ఉరేసుకుని ఉండటాన్ని స్థానికులు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. బంధువుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించారు.

పంచాయతీకి రూ.36 వేలు ఆదాయం

ప్రజాశక్తి - ఏర్పేడు : యండి పుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో పంచాయతీకి సంబంధించిన వ్యాపార సముదాయం షాపుల వేలం గురువారం నిర్వహించారు. ఈ వేలం పాటలో రెండు రూములు సంబంధించి ఒక్కొక్కటి సంవత్సరానికి పద్దెనిమిది వేలు చొప్పున ముప్పై ఆరువేల రూపాయలకు గ్రామంలోని సుబ్రమణ్యం, మునికృష్ణయ్యలు దక్కించుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీకి ముప్పై ఆరువేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ మోహనప్రియ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సముచిత వేతనాలు కల్పించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సముచిత వేతనాలు కల్పించాలని తిరుపతి జిల్లా నీటి యాజమాన్యపు సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని అనుపల్లి పంచాయతీ, బొప్పరాజు పల్లిలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వరద నీరు నిలిచే ప్రాంతాలలో ఫారం పాండ్స్, పార్కులేషన్ ట్యాంక్స్, కుంటలో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుజాత, సాంకేతిక సహాయకులు గోపి, జేఈ భాగ్యలక్ష్మి, క్షేత్ర సహాయకులు కె నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ నెల 6వ తేదీన ఆదివారం స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్ ఒకటవ అంతస్తులోని టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ బాక్సింగ్ డెవలప్మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి తరఫున జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ అమ్మెచూర్ బాక్సింగ్ అసోసియేషన్ తిరుపతి జిల్లా ఇన్చార్జి, కమిటీ మెంబర్ పి.గీతా గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీలకు క్యాబ్, కెడెట్, జూనియర్, సీనియర్ విభాగాలలో జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీలలో గెలిచిన వారికి ఈనెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. వివరాలకు 9573144232, 7013591635 ను సంప్రదించాలన్నారు.

గ్రీన్ టెక్నాలజీతో వ్యాపార ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) నేటి ఆధునిక సమాజంలో గ్రీన్ టెక్నాలజీతో చరమైన వ్యాపార ఆర్థిక అభివృద్ధిని సాధించ వచ్చునని ప్రసిద్ధ ఆర్థికవేత్త అంతర్జాతీయ ద్రవ్యనిధి సలహాదారు ఢిల్లీకి చెందిన డాక్టర్ చరణ్ సింగ్ అన్నారు. చంద్రగిరి మండలం ఏ.రంగంపేట సాయినాథ్ నగర్, ఎంబీయూలోని కామర్స్, మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో సత్య, హెరిక్స్, ఎస్ కే బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సహకారంతో ఎమర్జింగ్, టెక్నాలజీస్,బిజినెస్, సస్టైనబుల్ ఇన్నోవేటివ్ బిజినెస్ ప్రాక్టీసెస్, అండ్ సోషల్ వెల్ బీయింగ్ 2025 రెండవ జాతీయ సదస్సు రెండు రోజుల కార్యక్రమం నిర్వహించారు. సదస్సును ఎంతో విజయవంతంగా నిర్వహించిన డీన్ ఇన్చార్జ్ డాక్టర్ మాధవిని ఎం బి యు ఉపకులపతి డాక్టర్ కరుణాకరన్,రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, అక్రిడిటేషన్ అండ్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ శివ అభినందించారు.ఈ సదస్సు ద్వారా స్థిరమైన ఆర్థిక వ్యాపార ప్రాక్టీసులను,అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, దీర్ఘకాలిక ఆర్థిక పర్యావరణానికి దారి చూపుతోందని పలువురు ఆశాభావం వ్యక్తంచేశారు.

రచనా నైపుణ్యాలతో ఉన్నత అవకాశాలు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులకు రచనా నైపుణ్యాలతో ఉన్నత మైన రంగాలలో ఉన్నతమైన అవకాశాలు పొందేందుకు సువర్ణ అవకాశం మంచి రచన నైపుణ్యం వలన వస్తుందని యస్వీయు ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో "అకడమిక్ రైటింగ్"పై రెండు రోజుల జాతీయ వర్క్షాప్ను గురువారం ఎస్వీయు సెనేట్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నడి వీధి గంగమ్మ జాతర

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి మండల పరిధిలోని పుల్లయ్యగారిపల్లిలో 30 యేళ్ల తర్వాత గురువారం, అంగరంగ వైభవంగా నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. నడివీధి గంగమ్మ జాతరకు ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ హాజరయ్యారు. వినీల్ నడివీధి గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్ దివాకర్ రెడ్డి,వి సుబ్రహ్మణ్యం నాయుడు, బాలకృష్ణ, ఎస్ గౌస్ బాషా, సక్కూరి ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే పెంచాలి



బీసీ సంక్షేమశాఖ మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవితమ్మకి ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్ 1, గ్రూప్ 2, ఇతర అధికారులు ఎక్కడికెళ్ళిన వారు తాగే టి 150 రూపాయలు ఉంటుందనీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు రోజుకు మెస్ చార్జీలు మూడు, నాలుగు తరగతి విద్యార్థులకు 38 రూపాయలు, 5 నుండి 9వ తరగతి విద్యార్థులకు 46 రూపాయిలు, ఇంటర్, పైతరగతి విద్యార్థులకు 53 రూపాయలు రోజుకు ఇవ్వడం చాలా దారుణమైన విషయమన్నారు. బీసీ హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు మీ గుండెతోనా, కడుపుతోనా, చెవులతోనా విని తక్షణమే బీసీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలు మరియు కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలు పెంచాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులను కోరారు. రాష్ట్రంలో బీసీ హాస్టల్స్కు శాశ్వత భవనాలు కేటాయించి బీసీ విద్యార్థుల జీవితాలను కాపాడాలని కోరారు. బీసీ లేడీస్ హాస్టల్స్ కు వాచ్మెన్, హెల్పర్స్, హాస్టల్ వార్డెన్ ను ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి బీసీ లేడీస్ హాస్టల్స్ విద్యార్థినుల మాన ప్రాణాలు కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో అనేక పోటీ పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తా ఉంది బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టుకోలేక కొన్ని పరీక్షలు మాత్రమే రాయడానికి ముందుకెళ్తున్నారు, కొన్ని పోటీ పరీక్షలకు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇచ్చిన ఫీజు సడలింపు నిబంధనకు అనుగుణంగా బీసీ విద్యార్థులకు కూడా ఫీజు సడలింపు ఇచ్చి అన్ని పోటీ పరీక్షలు రాసుకునే విధంగా బీసీ విద్యార్థులకు వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయ ఉత్తరాది, చిత్తూరు జిల్లా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటయాదవ్, ఎస్వీయూ విద్యార్థి నాయకులు బజారి రంగస్వామి నాయక్, బిసి విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ, శ్రీవారిని చంద్రబాబు ప్రమోటర్‌గా వాడుకుంటున్నారు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టీటీడీని, వెంకటేశ్వర స్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమోటర్‌గా వాడుకుంటున్నారని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. పద్మావతిపురం లోని ఆయన నివాసం వద్ద గురువారం కరుణాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చెన్నైలో జీ స్క్వేర్ సంస్థ సొంత నిధులతో ఆలయం నిర్మాణానికి ముందుకు వచ్చిందనీ సీఎం చంద్రబాబు చెప్పడం ఎంత దారుణం. దీనికి ఆగమ శాస్త్ర సలహాలు తీసుకోవాలని చెప్పడం దారుణమన్నారు. టిటిడి చైర్మన్ అభ్యంతరం చెప్పినా సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది వేంకటేశ్వర స్వామి ని, టిటిడి లను ప్రమోటర్‌గా వాడుకోవడంగా అనిపిస్తోందన్నారు. సనాతన ధర్మం కాపాడతామని చెప్పిన డిప్యూటీ సీఎం ఎక్కడని ప్రశ్నించారు. మా పాలనలో తప్పు జరిగిందా..? మీ పదినెలల కాలంలో అపవిత్రం జరిగిందా? అనే అంశంపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట పెంచేలా వ్యవహరించాలని, స్వామిని రాజకీయాలకు వాడుకోవాలని చూస్తే అపచారం అవుతుందని విమర్శించారు. చిత్తశుద్ధితో ఆలయ ప్రతిష్ట పెంచేందుకు పనిచేయండని సూచించారు.

ఎస్వీ హై స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు

■ **అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి**

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల ఎస్వీ హై స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్నట్లు అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం తిరుమలలో టిటిడి అదనపు ఈఓ సిహెచ్.వెంకయ్య చౌదరి విద్యార్థులు, అధ్యాపకులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, అకడమిక్ ఇన్‌చార్జ్ రంగలక్ష్మి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ. కోటి విరాళం చెల్లించే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారికి రూ. కోటి విరాళం ఇచ్చే భక్తులకు టిటిడి ప్రత్యేక సౌకర్యాలు కల్పించనుంది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజులలో మినహా మిగిలిన రోజులలో కోటి విరాళం ఇచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చు. రూ. కోటి విరాళం ఇచ్చే దాతలకు జీవితకాలంలో దాతతో పాటు నలుగురికి ప్రతి ఏడాది క్రింది సౌకర్యాలను టిటిడి కల్పిస్తోంది. సంవత్సరంలో 3 రోజులు సుప్రభాత సేవ మరియు 3 రోజులు బ్రేక్ దర్శనం, 4 రోజుల పాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకోవచ్చు. వీటితోపాటు 10 పెద్ద లడ్డూలు, 20 చిన్న లడ్డూలు, దుప్పట – 1, రవికె – 1, మహా ప్రసాదం ప్యాకెట్లు – 10, ఒక సారి వేద ఆశీర్వచనం వంటి సౌకర్యాలను పొందవచ్చు వీటితో పాటుగా రూ. 3 వేలు రుసుం విలువ చేసే వసతి గదుల సదుపాయం 3 రోజులు కల్పిస్తారు. అంతేకాక జీవిత కాలంలో ఒకసారి దాతకు ఒక 5 గ్రాముల శ్రీవారి బంగారు డాలర్, ఒక 50 గ్రాముల సిల్వర్ డాలర్‌ను తగిన ఆధారాలను కార్యాలయం వారికి చూపించి పొందవచ్చు. దాతలు టిటిడి ట్రస్ట్‌లకు విరాళాలు ఇవ్వవచ్చు. కాటేజ్ డొనేషన్ స్కీం, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్టు, శ్రీవేంకటేశ్వర అన్నదాన ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయాస్ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ట్రస్ట్, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినీ స్కీమ్ (స్విమ్స్)లకు దాతలు విరాళాలు చెల్లించి సంబంధిత సౌకర్యాలను పొందవచ్చు. దాతలు టిటిడి వెబ్ సైట్‌లో ఆన్ లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్ లైన్ లో అయితే దాతలు ఈవో, టిటిడి పేరిట డి.డి/ చెక్‌లను తీసుకుని తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్ సెల్) అందజేయాలి.

కుంభాభిషేక మహోత్సవంలో రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ఎస్వీపురం పంచాయతీ, బేరివాని కండ్రిగ, శ్రీ సిద్ది వినాయక స్వామివారి ఆలయంలో గురువారం జరిగిన మహా కుంభాభిషేకం, ఆలయ జీర్ణోద్ధరణ, రజిత అష్టబంధన మహోత్సవాలకు మాజీ మంత్రి ఆర్.కె.రోజా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, పార్టీ ప్రెసిడెంట్, జిల్లా వైస్ ప్రెసిడెంట్, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, నియోజకవర్గ అనుబంధ విభాగ ప్రెసిడెంట్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం : నాని

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని నాయకులు అధికారుల సమన్వయంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం అన్నారు. పలు గ్రామాల్లో నీటి తొట్టెలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ మురళి, కొట్టే శివకుమార్, ఆర్పి రమణారెడ్డి, సంద్ర మోహన్ రెడ్డి, కండక్టర్ నాగిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు లోకనాథం, మల్లికార్జున్ రెడ్డి, ఆకెల రామకృష్ణారెడ్డి, సివి చంద్రశేఖర్ రెడ్డి, బి.కుమార్ స్వామి రెడ్డి, నాగచంగామ నాయుడు, సహదేవ రెడ్డి ,సి మునస్వామి నాయుడు, గువ్వల నాగిరెడ్డి, టిడిపి వెంకీ ,శేఖర ,చిట్టెమ్మ, గూడూరు సుబ్రహ్మణ్యం, చిట్టి వెంకటరత్నం, మల్లికార్జున మండల అధికారులు పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్లు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిఎం డిప్యూటీ ప్రైవేట్ కంపెనీ వారు సిఎస్ఆర్ నిధుల కింద గూడూరు ఎస్ కే ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 10 కంప్యూటర్లను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరిన వెంటనే డిఎం కంపెనీ వారు కంప్యూటర్లు అందజేశారని, కాలేజీ అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం, లీలావతి బుజిగెందర్ రావు, శ్రీనివాసులు రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రన్న ప్రభుత్వంలో అభివృద్ధికి పట్టం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : ఎమ్మెల్యే శ్రీ కోనేటి ఆదిమూలం గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. చిన్న పాండురులో సిమెంట్ రోడ్డు ప్రారంభించి, పశువుల నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. పెద్దపాండురు, చెన్నవారి పాలెం గ్రామాలలో సిమెంట్ రోడ్లు ప్రారంభించారు. వరదయ్య పాలెం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభించారు. ఇందిరా నగర్‌లో నూతన క్యాటిల్ షెడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిమూలంపై కుట్రలు మానండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తమ పార్టీకి చెందిన కొందరు (చెరుకు బ్యాచ్) చేస్తున్న కుట్ర రాజకీయాలను మానుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీ నాయకులకు పనులు కేటాయిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడంలేదని బుధవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లం శ్రీనివాస యాదవ్‌కు (చెరుకు బ్యాచ్) చేసిన ఫిర్యాదును గురువారం ఇలంగోవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ చెరుకు బ్యాచ్‌పై అధిష్టానం చర్యలు తీసుకోవాలని ఇలంగోవన్ రెడ్డి , పద్దు రాజు, మాజీ జడ్పిటిసి సుమంగళి, వాసు రెడ్డి, బత్తా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరత్, దొరవేలు, ఢిల్లీ బాబు, మొదట వారు పార్టీ నాయకులు అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల శ్రద్ధగా చదువుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ముని సుబ్రహ్మణ్యం తెలియజేశారు. మండలంలోని వేణుగోపాలపురం పాఠశాల, నెలవాయి బుచ్చిరాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, నిండికండ్రిగ పాఠశాల, నీర్పకోట పాఠశాలను గురువారం పర్యవేక్షించారు. రికార్డులను, హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యతతో మెను ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.